సాక్షి
వికారాబాద్

గురువారం । 30 । మే । 2024



సాగుకు సమాయత్తం

రోహిణి కార్తె రాకతో అన్నదాతల్లో ఆనందం మొదలైంది. వానాకాలం సాగుకు సంబురంగా పనులు ప్రారంభించారు. 8లో▸



మెరుగైన వైద్యం అందించండి

తాండూరు జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



కాగ్నాపై కొత్త వంతెన

యాలాల మండలం తాండూరు–కొడంగల్ మార్గంలోని కాగ్నా నదిపై కొత్త వంతెన నిర్మాణానికి మార్గం ఏర్పడింది. 9లో▸

న్యూస్‌రీల్

కళాశాలను సమర్థవంతంగా నిర్వహిద్దాం

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్
- ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం



కళాశాల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు, హెచ్‌ఎంలు

బొంరాస్‌పేట: మండల కేంద్రానికి కొత్త మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సమర్థవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. కళాశాల నిర్వహణ, ప్రవేశాలు, అధికారిక కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే అవకాశం ఉందన్నారు.

‘పర్యావరణం.. జీవనశైలి’పై అవగాహన



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

ధారూరు: మండలంలోని గురుదోట్ల గ్రామంలో బుధవారం భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ పర్యావరణం కోసం జీవనశైలి అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ అలివేలు, డాక్టర్ లక్ష్మమ్మ, డాక్టర్ సురేష్ మాట్లాడారు. నేటి వసతులు, నేల సంరక్షణ, కొత్త వంగడాలు, సస్యరక్షణ, పంట మార్పిడి పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మునిమురుగన్, డాక్టర్ లక్ష్మిప్రయాగ, డాక్టర్ రమేష్, డాక్టర్ దురైమురుగన్‌లు, ఎస్ఆర్ఎఫ్ రాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు కిరణ్, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2న జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 8.30 గంటలకు పతాకావిష్కరణ జరగాలని ఆదేశించారు. అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం తొమ్మిది గంటలకు కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ ఉంటుందని వివరించారు. కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు జరిగే చోట పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి, టెంట్లు, కుర్చీలు, డయాస్, విద్యుత్ సదుపాయం వంటివి సమకూర్చాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని డీఈఓ రేణుకాదేవికి సూచించారు.

నేటి నుంచి మండలాలకు పాఠ్యపుస్తకాలు



రెసిడెన్షియల్ స్కూళ్లకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

అనంతగిరి: జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ వెంకటగిరి బుధవారం తెలిపారు. గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభవుతుందని వివరించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ స్కూళ్లకు పంపిణీ చేశామని తెలిపారు.



వికారాబాద్‌లోని విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఏఓ గోపాల్ తదితరులు

ముందస్తు చర్యలు షురూ..

విత్తన పంపిణీపై అప్రమత్తమైన వ్యవసాయ శాఖ

- ఆదిలాబాద్ ఘటన నేపథ్యంతో కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష
- వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులతో సమావేశం
- విత్తన దుకాణాల్లో తనిఖీలకు టాస్క్‌ఫోర్స్ టీంల ఏర్పాటు
- వికారాబాద్‌లో డీఏఓ తనిఖీలు

వికారాబాద్: వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో రైతుల విత్తన సమస్యలను దృష్టిలో ఉంచుకుని వ్యయసాయ ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం అన్నదాతలు ఆందోళన చేయడం.. లాఠీ చార్జీ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అలర్టయ్యింది. బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి వ్యవసాయ, పోలీసు శాఖలతో సంయుక్తంగా అత్యవసర సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ కలసి టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు జిల్లాలోని ప్రతి విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇదే సమయంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, ఏడీఏ విజయ్ కుమార్, ఏఓ జ్యోతి వికారాబాద్‌లోని పలు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

బ్లాక్ మార్కెట్‌లో రేవంత్ సీడ్

జిల్లాలో పత్తి విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నప్పటికీ రెండు మూడు రకాల కోసం రైతులు ఎగబడుతున్నారు. ఇందులో ప్రధానంగా రేవంత్ రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ రకం విత్తనాలను రైతులు ఎక్కువగా అడుగుతుండటంతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. మిగతా విత్తనాలన్నీ దుకాణంలో సూచిక బోర్డులో పొందుపరుస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది దుకాణదారులు రేవంత్ సీడ్‌ను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల ప్యాకెట్ ధరకు రెండింతలు వసూలు చేస్తున్నారు. బిల్లులు మాత్రం ఎంఆర్‌పీ ప్రకారమే ఇస్తున్నారు. ఈ పరిస్థితి పరిగి, వికారాబాద్‌లోని ఒకటి రెండు మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

అందుబాటులో విత్తనాలు

ఈ ఏడాది జిల్లాలో 5.67లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో 2.63లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారని భావిస్తోంది. ఇందుకోసం 5.26లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని నివేదిక పంపారు. పది రోజుల తరువాత పత్తి పంట వేసే అవకాశం ఉన్నందున విత్తనాలు కొనేందుకు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు జిల్లాలో 2.54లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలను దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ఇందులో 17,353 ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేశారు. ఈ గణాంకాలను బట్టి చూస్తే జిల్లాలో విత్తనాల కొరత లేదని స్పష్టమవుతోంది.

అపోహలు వీడాలి

విత్తనాలు.. విత్తన కంపెనీల విషయంలో రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. సీడ్ ప్యాకెట్లపైన రాసినవి కేవలం వారి కంపెనీ పేరు మాత్రమే.. ప్రస్తుతం డబుల్ బీటీ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. దిగుబడి అనేది విత్తన కంపెనీపై ఆధారపడి ఉండదనే విషయం రైతులు గుర్తించాలి. విత్తనం విత్తుకున్నది మొదలు రైతులు అవలంబించే యాజమాన్య పద్ధతులపైనే దిగుబడి ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న విత్తనాలన్నీ కూడా శాస్త్రవేత్తలు సర్టిఫై చేసినవే. ఫలానా కంపెనీ.. ఫలానా రకం విత్తనం మాత్రమే కావాలని రైతులు అడగడం వల్ల సమస్య వస్తోంది. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మంచి దిగుబడులు వచ్చే విత్తనాలే దుకాణాల్లో ఉన్నాయి. హైబ్రీడ్ రకం విత్తనాలన్నీ ఓ క్వింటాల్ అటు ఇటుగా ఒకే రకమైన దిగుబడి వస్తుంది.

– గోపాల్, డీఏఓ

విత్తనాల కొరత లేదు: కలెక్టర్

అనంతగిరి: జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందరాదని కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌లో 2,63,500 ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకోసం 5,45,000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని, 2,58,500 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

నాణ్యమైన విత్తనాలే కొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పత్తి విత్తనాల ఎంపికలో సూచనలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొంటే మంచిదని రైతులకు సూచించారు. విడిగా విత్తనాలు కొనడం మంచిది కాదన్నారు. కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలిపారు. ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఒకవేళ దిగుబడి రాకుంటే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి గురించి సమాచారం ఇస్తే వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్ యంత్రాంగం దాడులు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించాలని, టాస్క్‌ఫోర్స్ టీలం సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రైతుల దగ్గరకు వెళ్లి ఏ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేశారనే వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు రవాణా కాకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచినట్లు వివరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, ఆర్‌డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్, ఏడీఏలు, ఏఓలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణను అడ్డుకుంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ‘రీక్రియేషన్ జోన్’ పేరిట రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. హెచ్‌ఎండీఏ ద్వారా ల్యాండ్ పూలింగ్ చేయతలపెట్టిన ఇబ్రహీంపట్నం, శేరిగూడ, ఉప్పరిగూడ, పోచారం, కప్పపహాడ్, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాల కు చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులతో ఇబ్రహీంపట్నంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. లేక్ డెవలప్‌మెంట్ జోన్, రీక్రియేషన్ జోన్ తదితర పేర్లతో 8 గ్రామాల్లోని పచ్చటి పంట పొలాలను సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎకరాకు లావణి పట్టా భూములకు 600గజాలు, పట్టా భూములకు 1,740గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని.. భూములు రాసివ్వాలని హెచ్‌ఎండీఏ అధికారులు రైతుల వెంట పడుతున్నట్లు తెలిపారు. ప్రజావసరాలు, పరిశ్రమల కోసం భూసేకరణ చేపట్టాలే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కాదన్నారు. అధికారులకు అంగీకార పత్రాలు ఇచ్చి రైతులు మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. గ్రామాల వారీగా రైతు సమావేశాలను ఏర్పాటు చేసి వారిని సంఘటితం చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



భరత్‌చంద్ర మృతదేహాన్ని వెలికితీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ప్రాణం తీసిన ఫొటో సరదా

- ‘పట్నం’ పెద్ద చెరువులో పడి యువకుడి మృతి
- నాలుగు గంటలు శ్రమించి మృతదేహాన్ని వెలికితీసిన ఆర్‌డీఎఫ్ సిబ్బంది



ప్రమాదానికి ముందు భరత్ దిగిన ఫొటో

ఇబ్రహీంపట్నం: ఫొటోలు దిగేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నంలోని ఎంబీఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న భరత్‌చంద్ర (22).. తన తమ్ముడు ప్రవీణ్(19)తో పాటు జోసెఫ్(15) అనే బాలుడితో కలిసి బుధవారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వచ్చాడు. చెరువుకట్ట వద్ద ఫొటో దిగుతుండగా ప్రమాదవశాత్తు భరత్ చంద్ర చెరువులో పడిపోయాడు. ప్రవీణ్, జోసెఫ్ ఇద్దరికీ ఈత రాకపోవడంతో రోడ్డుపైకి వచ్చి సాయం కోసం ఇతరులను వేడుకున్నారు. అయితే అప్పటికే భరత్ చంద్ర చెరువులో పూర్తిగా మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని నాలుగు గంటల పాటు శ్రమించి చెరువులో నుంచి భరత్ చంద్ర మృతదేహాన్ని బయటికి తీశారు. కాగా భరత్‌చంద్ర స్థానిక ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడని, అతడి స్వగ్రామం మంచాల మండలం ఆగాపల్లి అని తెలిసింది. ఇబ్రహీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలు సరే.. భవనాలేవీ?

- కొత్త జీపీలకు భవనాల కొరత
- కొన్నిచోట్ల అసంపూర్తి, మరికొన్ని చోట్ల ప్రారంభంకాని పనులు
- పాఠశాలలు, అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- ఇబ్బందుల్లో సిబ్బంది



మారేపల్లి తండాలో పంచాయతీకి కేటాయించిన పాఠశాల భవనం

పెద్దేముల్: ఐదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలకు పంచాయతీ హోదా కల్పించింది. ప్రతి జీపీలో రూ.20లక్షలతో భవనం నిర్మించాలని నిర్ణయించింది. అయితే పనులను అప్పటి సర్పంచులకు అప్పగించింది. సర్పంచులకు ఆర్థిక భారం కావడంతో పనులు చేపట్టలేదు. కొంతమంది పనులు ప్రారంభించినా బిల్లులు వస్తాయా రావా అనే అనుమానంతో మధ్యలో ఆపేశారు. మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉండగా.. బీఆర్ఎస్ హయాంలో 12 తండాలకు పంచాయతీ హోదా లభించింది. ఒక్కో పంచాయతీలో రూ. 20లక్షలతో భవనం నిర్మించాలని నిర్ణయించింది. అప్పట్లో పనులను సర్పంచులకు అప్పగించింది. గొట్లపల్లి, ఆత్కూర్, బంపల్లి, ఊరెంటి తండాల్లో పనులు ప్రారంభమైనా నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గిర్మాపూర్, మారేపల్లి తండా, సిద్దన్న మడుగు తండా, ఎర్రగోడు తండా, ఖానాపూర్ గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు. భవనాలు లేక పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, అద్దె భవనాల్లో జీపీలను నిర్వహిస్తున్నారు. గిర్మాపూర్‌లో అంగన్‌వాడీ భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగేది. వారు కూడా ఖాళీ చేయమనడంతో ప్రస్తుతం వాటర్ ఫిల్టర్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. బంపల్లిలో అద్దె భవనంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ సిద్ధార్థను వివరణ కోరగా.. అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. మిగిలిన చోట్ల పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

- త్రిదండి చినజీయర్ స్వామి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని త్రిదండి చినజీయర్ స్వామి సూచించారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. అనంతరం స్వామివారిని సత్కరించారు. ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులు అంతా ఒక్కచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల స్వర్ణోత్సవాల కమిటీ అధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

దరఖాస్తుల జారీలో జాప్యం వద్దు

- మీసేవ దరఖాస్తులపై తహసీల్దార్లతో రంగారెడ్డి కలెక్టర్ శశాంక సమీక్ష
- గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై దిశానిర్దేశం



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మీసేవ కేంద్రాల ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలకు అందుతున్న దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో.. మండల తహసీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా, మండల స్థాయిలో జనన, మరణ, కుల ధ్రువీకరణ, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, రెసిడెన్సీ, ఇతర వెనుకబడిన తరగతుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని అధిగమించేందుకు మీసేవ నిర్వాహకులు అనుసరించాల్సిన విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధిక సంఖ్యలో వచ్చిన అప్లికేషన్లకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా త్వరితగతిన పరిష్కరించాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మండల స్థాయిలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆపరేటర్లకు డివిజినల్ వారీగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని అధిగమించవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఈడీఎం నాగభూషణం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్–1కు పకడ్బందీ ఏర్పాట్లు..

జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో.. అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, సంబంధిత అధికారులతో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను మొదటిసారి బయోమెట్రిక్ పద్ధతితో నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లాలో మొత్తం 93 పరీక్ష కేంద్రాల్లో 55,692 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని.. ఎలాంటి పొరపాట్లకు తావియ్యరాదని సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుట్కాలు విక్రయిస్తే కేసులు

ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

కుల్కచర్ల: గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పాన్ షాప్, మరో కిరాణా దుకాణంపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సుమారు రూ.1,500 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని మహ్మద్ ఫయాజ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గుట్కాలపై ప్రభుత్వం నిషేధం విధించిందని ఎవరైనా విక్రయించినా.. సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి బలవన్మరణం

కుల్కచర్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చౌడాపూర్ మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నీర్‌సాబ్ తండాకు చెందిన కాత్రవత్ రవి(37) కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. వాటిని తిరిగి చెల్లించే మార్గం లేక మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. బుధవారం ఉదయం కటింగ్ చేసుకుని వస్తానని భార్య నీలమ్మకు చెప్పి పాత ఇంటిలో దూలానికి ఉరేసుకున్నాడు. భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట ఎస్‌ఐ అభిషేక్ రెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు



ఫిర్యాదు పత్రంతో పీడీఎస్‌యూ నాయకులు

తాండూరు టౌన్: ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తనపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్ సత్తార్, ఆయనకు మద్దతుగా నిలిచిన ఎస్‌ఐ కాశీనాథ్‌లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. అనంతరం మాట్లాడారు. టీవీఎస్ ఫైనాన్స్ కంపెనీ వారు వాయిదాల తప్పుడు లెక్కలతో మోసం చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 23న ఫిర్యాదు రాస్తుండగా.. కానిస్టేబుల్ దాడి చేసినట్లు శ్రీనివాస్ ఆరోపించారు. ఇదే విషయమై డీఎస్పీ బాలకృష్ణా రెడ్డికి వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని విమర్శించారు. అందుకే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయనతో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి గీతామహేందర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు జైపాల్, సురేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

తలకొండపల్లి: ఫిల్టర్ ఇసుకను తయారు చేయడానికి అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంతంలోని వాగు సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు, ఒక జేసీబీని పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసి స్వాధీన పర్చుకున్నారు. అనంతరం వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్లు రమేశ్, శ్రీను, జంగయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

సాగుకు సమాయత్తం

- వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు
- రోహిణి కార్తె ఆగమనంతో ఆనందంలో అన్నదాతలు



పశువుల ఎరువును తరలిస్తున్న రైతులు

దౌల్తాబాద్: రోహిణి కార్తె రాకతో అన్నదాతల్లో ఆనందం మొదలైంది. వానాకాలం సాగుకు సంబురంగా పనులు ప్రారంభించారు. నైరుతి రుతుపవనాలు ఇదే కార్తెలో వస్తుండడంతో ఇప్పటికే రైతులు పొలాలకు పశువుల ఎరువు తరలిస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

పాలేర్ల కొరత

ఏడాదంతా పనిచేసేందుకు రైతులు కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ప్రస్తుతం మగవారికి ఏడాదికి రూ.లక్ష వరకు జీతం ఇచ్చినా దొరికే పరిస్థితి లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారే పాలేర్లుగా ఉంటున్నారు. ఆడ వారికి సుమారు రూ.50వేలు వరకు ఇస్తున్నారు.

విత్తనాలు సిద్ధం

మండల పరిధిలో 5,895 ఎకరాల్లో రైతులు వరి, పత్తి, కంది, పెసర పంటలు సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుతం జనుము, జీలుగ, కంది, పెసర విత్తనాలు అందుబాటులో ఉంచారు. జనుము, జీలుగ విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేసినామని అధికారులు చెబుతున్నా రైతులందరికీ అందడం గగనంగానే మారింది.

ముందస్తుగా ఎరువుల కొనుగోలు

గతంలో యూరియావంటి రసాయన ఎరువులకు కొరత ఏర్పడి రైతులు ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు ధరలు ఎప్పుడు పెరుగుతాయో..? ఎప్పుడు తగ్గుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ముందు జాగ్రత్తగా ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకుంటున్నారు.

వర్షాలపై ఆందోళన

ఈ ఏడాది సైతం సాధరణ వర్షపాత నమోదవుతుందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు వానాకాలం సాగుకు సమాయత్తమవుతున్నారు. నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే రావచ్చనే అంచనాల దృష్ట్యా రైతులు అన్ని విధాలుగా సిద్ధమవుతున్నారు.

రుణాలపై సందిగ్ధం

పంట రుణాలపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. రైతులు మే, జూన్‌లో బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుని ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటారు. ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ.2లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. రుణాల రెన్యూవల్‌కు రైతులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

ఈదురు గాలులకు అస్తవ్యస్తం

- కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు
- తెగిపడిన కరెంట్ వైర్లు
- నాలుగు రోజులుగా సరిచేస్తున్నాం: ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో నాలుగు రోజుల క్రితం గాలిదుమారానికి చెట్లు విరిగిపడ్డాయి.. పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరగాయి.. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. నాలుగు రోజులుగా సరిచేసేందుకు యత్నిస్తున్నామని ఇంకొంత సమయం పడుతుందని.. బుధవారం ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి తెలపగా.. అధికారుల నిర్లక్ష్యానికి జీవాలతో పాటుగా తమ ప్రాణాలకు హాని ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లపై 120 స్తంభాలు

ఈదురు గాలులకు ఇప్పటి వరకు 120 స్తంభాలు విరిగి చెట్లపై పడి, పది ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడి పాడయ్యాయని ట్రాన్స్‌కో ఏఈ వెల్లడించారు. దీంతో సంస్థకు రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వివరించారు. 70ఏళ్లలో ఇటువంటి ఉపద్రవం రాలేదని గ్రామస్తులే చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చునన్నారు. గురువారం వరకు పనులు పూర్తి చేయించేందుకు యత్నిస్తున్నామన్నారు. నాగారం గ్రామానికి చెందిన రైతు నర్సింహులు ఎద్దు మృతి చెందింది పశువైద్యులు ఇచ్చే రిపోర్టు ప్రకారం రైతుకు పరిహారం అందుతుందన్నారు. మూడురోజులుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కట్ చేసి పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని వివరించారు.

ఎద్దును కననం చేయలేకపోయాం

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా పొలాలకు వెళ్లాలంటేనే జంకుతున్నామని రైతులు వాపోతున్నారు. ఆదివారం నుంచి పొలాల్లో విరిగిన విద్యుత్ స్తంభాలు, వైర్లు ఎక్కడివి అక్కడే ఉన్నాయన్నారు. మృతి చెందిన ఎద్దు కిందనే విద్యుత్ వైర్లు ఉండడంతో కననం చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది తక్షణమే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



జిల్లా ఆస్పత్రిలో ప్రజా సంఘాల నాయకులు

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కోరిన ప్రజా సంఘాలు

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయా సంఘాల నాయకులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రికి ఎక్కువగా పేదలు వస్తుంటారని.. వారికి మెరుగైన వైద్యం కల్పిస్తే వారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే అవసరం ఉండదన్నారు. పేదలు ఆస్పత్రులకు వెళ్లి అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య చికిత్సలకు సరిపడా వైద్యులను నియమించాలని కోరారు. సౌకర్యాలను మెరుగుపరచాలని, ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించకుండా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించకుండా అన్యాయం చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య, అంబేడ్కర్, పూలే సంఘం అధ్యక్షుడు రఘుపతి, రవికుమార్ తదితరులున్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలించొద్దు

- ఆర్‌ఐ నవీన్‌కుమార్
- వాగ్వాదానికి దిగిన రంగంపల్లి గ్రామస్తులు



ఆర్‌ఐతో గొడవపడుతున్న గ్రామస్తులు

పరిగి: మండల పరిధిలోని బాబాపూర్ చెరువులో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్‌ఐ నవీన్‌కుమార్ అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న రంగంపల్లి గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్‌ఐతో వాగ్వాదానికి దిగారు. వివరాల ప్రకారం.. రంగంపల్లి గ్రామస్తులు జేసీబీ, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆర్‌ఐ నవీన్‌కుమార్ అక్కడకు చేరుకుని మట్టి తరలింపు నిలిపి వేయాలని సూచించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆర్‌ఐతో వాగ్వాదానికి దిగారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు చెప్పాలని కోరారు. ఓ పార్టీ సీనియర్ నేత అండదండలు మాకున్నాయని చెరువు దగ్గరకు వచ్చి చూడంటూ ఆర్‌ఐను హెచ్చరించారు. కొందరు గ్రామస్తులు వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఇబ్రహీంపట్నం: వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమై అందులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద చెరువు కట్ట కింది రోడ్డులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలో టీకేఆర్ కమాన్ వద్ద నివసించే శ్రీనుతో పాటు మరో ముగ్గురు బుధవారం ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కారులో వస్తున్నారు. స్థానిక కట్ట కింది రోడ్డుపై అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి తూము పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నాలా పనులు పూర్తి చేయండి



మంత్రాల చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వర్షాకాలం సమీపిస్తున్నందున కార్పొరేషన్‌లో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని మంత్రాల చెరువును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఎన్‌డీపీ(స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా సుందరీకరణలో భాగంగా అసంపూర్తిగా ఉన్న వాకింగ్ ట్రాక్, ఇతర పనులు చేపట్టాలని.. చెరువు చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు మోడల బాలకృష్ణ, సిద్దాల లావణ్య, ఎస్ఈ ఆంజనేయ ప్రసాద్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని క్లినిక్‌లను సీజ్ చేయండి

కలెక్టర్‌కు విన్నవించిన సీపీఎం కార్యదర్శి మైపాల్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఆర్ఎంపీ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. బుధవారం వారు ఇదే విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నకిలీ దవాఖానాలతో పేద ప్రజల సొమ్ము కాజేస్తూ.. ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొర సౌకర్యాలతో పేద రోగుల నుంచి లక్షలు దండుకుంటున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం



పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఈ సుబ్రహ్మణ్యం

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో బావి పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరుకు ప్రత్యామ్నాయంగా స్థానికంగా నీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి బావులు, బోర్లకు మరమ్మతులు చేసి వినియోగానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారులు ప్రతి రోజు 3, 4 పాఠశాలలు సందర్శించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టక ముందు, పనులు చేపట్టిన తర్వాత ఫొటోలు పంపాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున బెలూన్స్ పెట్టి అందంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమూలమైన మార్పులు తెచ్చేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' తీసుకొచ్చామన్నారు. పాఠశాలలో చేపట్టిన పనులను వచ్చే నెల 10 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మౌలిక వసతులు కల్పనలో భాగంగా పాఠశాలలో చేపట్టిన తాగునీరు, టాయిలెట్స్, విద్యుద్దీకరణ పనులు ఇప్పటివరకు ఎన్ని పూర్తయినవి, ఇంకా ఎన్ని చేపట్టాల్సినవి ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 3 నుంచి పెద్ద ఎత్తున బడి బాట కార్యక్రమం చేపట్టాలని ముఖ్యంగా బడి ఈడు పిల్లలు బడికి వచ్చేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంఈఓలు ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఏపీఎంలు ప్రత్యేక అధికారులు రెండు రోజులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రణాళిక ప్రకారం బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, డీఈఓ రేణుకాదేవి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించండి

- తప్పనిసరి అయితేనే సిజేరియన్స్
- జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్



గాయత్రి నర్సింగ్ హోంలో తనిఖీలు చేస్తున్న డాక్టర్ పల్వన్‌కుమార్

అనంతగిరి: గైనకాలజిస్టులు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని.. తప్పనిసరైతేనే సిజేరియన్స్ చేయాలని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన వికారాబాద్ పట్టణంలోని గాయత్రి నర్సింగ్ హోంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలన్నీ సిజేరియన్స్‌గా గుర్తించి కారణాలు తెలపాలని యాజమాన్యానికి నోటీసులిచ్చారు. పేషెంట్ కేస్ షీట్‌లు అసంపూర్తిగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పేషెంట్ కేస్ షీట్‌లలో పూర్వ, ప్రస్తుత గర్భస్త చరిత్ర, ఆపరేషన్ థియేటర్ నోట్స్, చికిత్స, డిశ్చార్జ్ సమ్మరీ కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ యాక్ట్ 2010 ప్రకారం సి సెక్షన్ నిబంధనలు ఉల్లంఘించిన గైనకాలజిస్టులు, ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువపత్రాలైతే చర్యలు

నారాయణపేట జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

కుల్కచర్ల: తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చి ఉద్యోగాలు సాధించినట్లు నిర్ధారణయితే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని నారాయణపేట జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. బుధవారం ఆయన ఎంఈఓ కార్యాలయంలో విధుల నుంచి తొలగింపబడిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాలు పరిశీలించారు. మండల పరిధిలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కొండల్ రెడ్డి, చెరువుముందలి తండా(ఎ)లో పని చేస్తున్న రాంచందర్, దోమ మండలం ఐనాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎల్లారెడ్డి తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చి ఉద్యోగాలు సాధించారని 2015లో గోపాల్ అనే వ్యక్తి విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీఈఓ సత్యనారాయణరెడ్డి 2019లో వారిని సస్పెండ్ చేశారు. వారు హైకోర్టును ఆశ్రయించగా 2017లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులపై విచారణ కొనసాగిస్తూ సగం వేతనం చెల్లించాలని తీర్పునిచ్చింది. మార్చి 12న వారి ధ్రువపత్రాలపై వివరణ కోరగా పదిరోజుల గడువు కోరారు. అనంతరం బుధవారం మరోమారు వారి నుంచి ధ్రువపత్రాలపై వివరణ తీసుకున్నారు. వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని డీఈఓ అబ్దుల్ ఘని మీడియాకు తెలిపారు.

విత్తన కొనుగోలు రసీదులు తప్పనిసరి

ఏఈఓ మదన్‌మోహన్

యాలాల: విత్తన కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ మదన్‌మోహన్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని అడాల్‌పూర్‌లో రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు, రసీదులు తప్పక తీసుకోవాలని సూచించారు. వీటిని పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్త పరుచుకోవాలని చెప్పారు. వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు పొందిన షాపుల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండి, అధిక దిగుబడి సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ పేరు.. బ్యాచ్ నంబర్

బంట్వారం: లైసెన్స్ ఉన్న విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ ఏఓ సంధ్య సూచించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పత్తి విత్తనాలు కొనే రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని చెప్పారు. బోల్‌గార్డు–2 పత్తి రకం ప్యాకెట్ రూ.864 మాత్రమే ఉంటుందన్నారు. రసీదు మీద విత్తన కంపెనీ పేరు, రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, రేటు తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తన ప్యాకెటు మీద తయారైన తేది చూసుకోవాలన్నారు. ప్రతీ విత్తన ప్యాకెట్ మీద జీఈఎసీ నెంబర్ ఉందా లేదా అనేది గమనించాలన్నారు.

అందుబాటులో జనుము విత్తనాలు: ఏడీఏ

తాండూరు రూరల్: తాండూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌కు వానాకాలం సీజన్‌లో జనుము విత్తనాలు 214 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బషీరాబాద్ మండలానికి 25 క్వింటాళ్లు, పెద్దేముల్ మండలానికి 40 క్వింటాళ్లు, తాండూరు మండలానికి 84 క్వింటాళ్లు, యాలాల మండలానికి 65 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయించామన్నారు. క్వింటాల్‌కు 3,620 చొప్పున 65 శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.